## మున్సిపల్ ఎన్నికల్లో కట్టుదిట్టమైన భద్రత

**-జిల్లా అదనపు ఎస్పీ రఘునందన్‌రరావు**

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** ఈ నెల 11న జరుగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా 11 వందల మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని జిల్లా అదనపు ఎస్పీ రఘునందన్‌రావు అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో రూట్ మొబైల్ అధికారులు, ఎన్నికల విధులకు హాజరవుతున్న సిబ్బందికి బ్రీఫింగ్ కార్యక్రమం నిర్వహించి రఘునందన్‌రావు పలు సూచనలు చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా ప్రతి ఒక్కరు తమ వంతు సహకరించాలన్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్దతులపై వివరించారు. విధి నిర్వాహణలో అలక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ నరేందర్, ఇన్స్‌పెక్టర్లు రమేష్, కిరణ్, ప్రవీణ్‌రెడ్డి, సదా నాగరాజు, ఆర్ఐలు రాజశేఖర్‌రెడ్డి, ఎలక్షన్ సెల్ అధికారులు, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సివిల్ ఆర్మ్‌డ్ సిబ్బంది పాల్గొన్నారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట వార్త

**'వార్త' ఎఫెక్ట్**

## విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మొబైల్ ఫోన్ ఏర్పాటు

**అక్కన్నపేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**

'పనిచేయని అక్కన్నపేట సబ్ స్టేషన్, ఫోన్ నెంబర్‌తో రైతుల అవస్థలు' శీర్షికతో సోమవారం 'వార్త'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ ఏఈ బద్దం హరీష్‌రెడ్డి స్పందించారు. రైతుల ఇబ్బందులను గుర్తించిన ఆయన తక్షణమే సబ్‌స్టేషన్‌కు నూతన మొబైల్ ఫోన్ ఏర్పాటు చేసి, రైతులు సమస్యలను తెలియజేసేందుకు అందు బాటులో ఉంచామన్నారు. సందర్భంగా రైతుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రభాతవార్తతో పాటు కథనం రాగానే వేగంగా స్పందించిన ఏఈ హరీష్‌రెడ్డికి రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




## ఎన్నికల పక్రియ సాఫీగా జరగాలి

**మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్**

**మెదక్ టౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల పక్రియ సాఫీగా జరగాలని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్‌రాజ్ మాట్లాడుతూ,జిల్లాలో జరగనున్న నాలుగు మున్సిపాలిటీ ఎన్నికలు సాఫీగా జరగాలనన్నారు. ఎన్నికల నిర్వహణ పనులు పూర్తికాకపోతే ఈ రోజు పూర్తిచేసి, రేపు ఉదయం 9 గంటల వరకు ఎన్నికల సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలో రిపోర్ట్ చేయాలన్నారు. ఎన్నికల సిబ్బందికి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో తగినన్ని కౌంటర్లు ఏర్పాటు చేసి మార్గనిర్దేశనం చేయాలన్నారు. ఆర్వోలు, జోనల్ అధికారులు ఎన్నికల వస్తు సామాగ్రిని పరిశీలించుకొని, పోలీస్ సంబంధిత ఎస్కార్ట్ వాహనంతో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన పోలింగ్ సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నియమాలను అనుసరించి పత్రాలను నింపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి,ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

**సిద్దిపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సిద్దిపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 11న జిల్లాలోని గజ్వేల్, చేర్యాల, దుబ్బాక, హుస్నాబాద్ మున్సిపాలిటీలో జరిగే ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్‌తో పాటు ఈనెల 13న జరిగే కౌటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఆయా మున్సిపాలిటీలలో 72 వార్డులకుగానూ 176 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1069 మంది పోలింగ్ సిబ్బందిని నియమించి 18 రూట్లను 22మంది జోనల్ అధికారులను నియమించినట్లు వివరించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేస్తున్నామని 31 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి 31 మంది మైక్రో పరిశీలకును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో వందశాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. 13న ఓట్ల లెక్కింపునకు గజ్వేల్ మున్సిపాలిటీలో 14 టేబుల్స్, మిగితా మూడు మున్సిపాలిటీలో 7 టేబుల్స్ చొప్పున ఏర్పాటు చేసినట్లు వివరించారు. నాలుగు మున్సిపాలిటీలలో 1 లక్ష 1 వేయి 85 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకొనున్నారని తెలిపారు. ఆయా మున్సిపాలిటీలలో ఓటర్లు ఓటు హక్కును తప్పకుండా వందశాతం వినియోగించుకోవాలన్నారు.

## పోలింగ్ నిర్వహణ తీరును పరిశీలించాలి

**జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్**




మాట్లాడుతున్న జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** ఎన్నికలలో ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని మైక్రోఅబ్జర్వర్లు నిశితంగా పరిశీలించాలని జనరల్ అబ్జర్వర్ ఉదయ్‌కుమార్ సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు తు.చ తప్పకుండా అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆయన హితవుపలికారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సూక్ష్మ స్థాయిలో పరిశీలించేందుకు నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఎన్నికల సాధారణ పరిశీలకులు ఉదయ్‌కుమార్ హాజరై మైక్రో అబ్జర్వర్లకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్లు పరిశీలకులుగా మాత్రమే వ్యవహరించాలని, ఓటింగ్ మరియు కౌంటింగ్ రోజుల్లో పూర్తిస్థాయి ప్రక్రియను గమనించి, గమనించిన అంశాలపై నివేదికలను లిఖితపూర్వకంగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. మైక్రో అబ్జర్వర్లు తమ విధులు, బాధ్యతల పరిధిలోనే పనిచేయాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ, సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరించి ఆయా మున్సిపాలిటీల పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లకు బాధ్యతలు కేటాయించడం జరుగుతుందన్నారు. పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై మైక్రో అబ్జర్వర్లు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను సమర్థవంతంగా పరిశీలించగలుగుతారని అన్నారు. పోలింగ్ పూర్తయ్యే వరకు అన్ని అంశాలను జాగ్రత్తగా గమనిస్తూ, ఓటింగ్ గోప్యతను కాపాడే విధంగా మైక్రో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్ మైక్రో అబ్జర్వర్ల విధులు, బాధ్యతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ శిక్షణ తరగతుల్లో ఎన్నికల శిక్షణల నోడల్ అధికారి రామాచారి, డీఈఓ వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ నర్సింగ్, మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్, మైక్రో అబ్జర్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అవగాహన విస్తరణే లక్ష్యం

**- అడిషనల్ కలెక్టర్ పాండు**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుంచి 13 వరకు నిర్వహించనున్న ఫైనాన్షియల్ లిటరసీ వీక్-2026 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ పాండు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'కేవైసీ-యువర్ ఫస్ట్‌స్టెప్ టూ సేఫ్ బ్యాంకింగ్' అనే అంశంపై ఈఏడాది ఫైనాన్షియల్ లిటరసీ వీక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో కేవైసీ(నౌ యువర్ కస్టమర్) నిబంధనలపై అవగాహన పెంపొందించడం, సెంట్రల్ కేవైసీ రిజిస్ట్రీ ప్రాముఖ్యత, ఖాత భద్రత, మోసాల నివారణ, మనీ మ్యూలింగ్‌వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆర్థిక అవగాహన మరింత విస్తృతంగా చేరేలా గ్రామసభలు, అవగాహన శిబిరాలు, సమావేశాల ద్వారా బ్యాంకులు, సంబంధిత శాఖలు సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్ఆర్ఎల్ఎం పరిధిలోని స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల ద్వారా విస్తృతస్థాయిలో ప్రజలను చైతన్యవంతులను చేయాలని తెలిపారు. అలాగే పట్టణప్రాంతాల్లో పట్టణ స్వయం సహాయక సంఘాలు, వార్డుస్థాయి సంఘాల సమావేశాల ద్వారా ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ నర్సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం

### ప్రలోభాలకు తెర లేపిన అభ్యర్థులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలోని దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్, చేర్యాల మున్సిపాలిటీలకు ఈనెల 11న జరగనున్న ఎన్నికల ప్రచారం సోమవారంతో ముగిసింది. ఆరు రోజులుగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి అభ్యర్థులు పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారాన్ని హోరెత్తించారు. వీరికి తోడు సీపీఐ, సీపీఎం, బిఎస్‌పి అభ్యర్థులతో పాటు బిఆర్ఎస్ రెబల్స్, స్వతంత్ర అభ్యర్థులు తామేమి తక్కువ కాదన్న రీతిలో ప్రచారం నిర్వహించారు. ఆయా పార్టీల అభ్యర్థులు డప్పుచప్పుళ్లు, కళాకారుల ఆటపాటలతో గెలుపు కోసం పాదయాత్రల ద్వారా ఇంటింటికి తిరిగి ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. జిల్లాలోని చేర్యాల 12, గజ్వేల్ 20, దుబ్బాక 20, హుస్నాబాద్ 20 మొత్తం 72 వార్డులకు ఎన్నికలు జరగనుండగా 323 మంది అభ్యర్థులు బరిలో నిలిచి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. హుస్నాబాద్ మున్సిపాలిటీలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మకాం వేసి జోరుగా అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారాం నిర్వహించారు. అలాగే ఒక రోజు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాగా హుస్నాబాద్‌లో బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్‌కుమార్ ఒక్కరే అన్ని తానై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గజ్వేల్, దుబ్బాక మున్సిపాలిటీలలో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం మాజీ మంత్రి,ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ప్రభుత్వ మోసాలను ఎండగడుతూ ప్రచారం నిర్వహించారు. అధికార కాంగ్రెస్ పార్టీ మంత్రులు ఎన్నికల ప్రచారంలో ఆయా మున్సిపాలిటీలలో జరిగిన జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. చేర్యాలలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. కాగా బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డికి తోడు సిద్దిపేటకు చెందిన బిఆర్ఎస్ నాయకులు ఎల్లు రవీందర్‌రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరించి అన్నీ తానై ప్రచారం నిర్వహించారు. దుబ్బాకలో బిజెపి తరపున కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి మాధవనేని రఘునందన్‌రావు ఎన్నికల ప్రచారంలో పాల్గొనగా గజ్వేల్‌లో ఎంపిలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్‌లు పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తూతూ మంత్రంగా ఎన్నికల ప్రచారం నిర్వహించి చేతులు దులుపుకున్నారు. కాగా హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీలలో బిజెపి పెద్దలు ప్రచారానికి ఎవరూ రాకున్న అభ్యర్థులు మాత్రం ప్రచారాన్ని హోరెత్తించారు. గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం మైనార్టీశాఖ మంత్రి అజారొద్దీన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. స్వతంత్రులు, బిఆర్ఎస్ రెబల్స్ తామేమి తక్కువ కాదన్న రీతిలో తమ ప్రచారాన్ని హోరెత్తించారు. ఈ ఎన్నికలో ప్రచార హోరునుబట్టి చూస్తుంటే పలు వార్డులో స్వతంత్రులు, బిఆర్ఎస్ రెబల్స్ తమ సత్తా చాటే అవకాశం ఉందని చెప్పక తప్పదు. మొత్తం మీద జిల్లాలో మున్సిపల్ పోరు ప్రచారం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంతంగా ముగిసింది.

**ప్రలోభాలకు తెర లేపిన అభ్యర్థులు**

మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగియడంతో ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు ప్రలోభాలకు తెరలేపారు. తమ తమ వార్డులో ఓటర్లను మచ్చిక చేసుకోవడానికి మద్యం, డబ్బు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. పార్టీల అభ్యర్థులు గుట్టుచప్పుడు కాకుండా ఓటర్ల ఇంటికి నేరుగా వెళ్లి మద్యం, డబ్బు పంపిణీచేస్తూ తనకు ఓటు వేయాలని కోరుతున్నట్లు తెలుస్తుంది. ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీ చేయకుండా పోలీసులు డేగ కన్ను వేసినట్లు తెలుస్తుంది.

**చివరి రోజు మార్మోగిని ఎన్నికల ప్రచారం**

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా చివరిరోజు సోమవారం వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు,బిఆర్ఎస్ రెబల్స్ ఎన్నికల ప్రచారాన్ని మార్మోగించారు. పాదయాత్రలు, ఇంటింటి ప్రచారాలు, బైక్ ర్యాలీలు జోరుగా నిర్వహించారు.



మాట్లాడుతున్న మెదక్ ఎంపి రఘునందన్‌రావు

## బిఆర్ఎస్ నిజస్వరూపాన్ని బయటపెడుతున్న కవిత

**మెదక్ ఎంపి రఘునందన్‌రావు**

**గజ్వేల్/గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త):** ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో నిర్వాసితులను నిండా ముంచిన బిఆర్ఎస్‌కు తగిన శాస్తి తప్పదని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. సోమవారం గజ్వేల్‌లో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచార సభకు హాజరై ప్రసంగించారు. గజ్వేల్, సిద్దిపేటలో పెత్తనం చేస్తున్న హరీష్‌రావుకు 610 జివో ఎందుకు వర్తించదని నిలదీశారు. నా నోట్లో వేలుపెడితే నువ్వు తట్టుకోలేవని, ఇక మిగిలింది నిన్ను ఇక్కడినుంచి తరిమేయడమేనని పేర్కొన్నారు. పేదలఇళ్లు కూల్చి ఫాంహౌజ్‌కు దారివేసుకోగా, పేదల కష్టాలు ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు. 13 ఏళ్లుగా ఫాంహౌజ్‌లో పండుకున్న కెసిఆర్ ఏ ఒక్క రోజు గజ్వేల్ ప్రజలకు కనిపించలేదని గుర్తుచేశారు. పరిశ్రమల ఏర్పాటు పేరుతో భూములు లాక్కుంటారనే భయంతో కామారెడ్డి ప్రజలు తగిన బుద్ది చెప్పగా, నమ్మి ఓట్లేసిన పాపానికి గజ్వేల్ ప్రజలు ఆవేదన అనుభవిస్తున్నారని స్పష్టం చేశారు. మల్లన్నసాగర్ నిర్వాసిత గ్రామాల ప్రజలు బిఆర్ఎస్ నేతలకు శాంపిల్ మాత్రమే చూపించారని, ముంపు బాధితులకు న్యాయం చేయాల్సిన కెసిఆర్ అవేమీ పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ అసలు నిజస్వరూపాన్ని కవిత బయట పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గాడిపల్లి కళ్యాణి, మాజీ చైర్మన్ భాస్కర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు శంకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సింగం సత్తయ్య, జిల్లా అధికార ప్రతినిధి నందన్‌గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ పాల్గొన్నారు.

## కుకునూరుపల్లి పిహెచ్‌సిలో ఎసి దగ్ధం

**కొండపాక, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి పిహెచ్‌సిలో ఎసి దగ్దమైన సంఘటన సోమవారం ఉదయం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూరుపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెలివరి గదిలో ఉన్న ఎసి విద్యుత్ షార్ట్‌సర్క్యూత్‌తో కాలిపోయింది. సమాచారం తెలుసుకున్న డిఎంహెచ్ఒ ధన్‌రాజ్, డిప్యూటీ డిఎంహెచ్ఒ శ్రీనివాస్ వెంటనే పిహెచ్‌సిని సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. గదిలో ఉండే కిటికీల కర్టన్‌లకు, విద్యుత్ పరికరాలకు, ఇతర వస్తువులకు మంటలు అంటుకొని ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేది. ఏదిఏమైనా తృటిలో పెనుప్రమాదం తప్పింది. ఈ విషయమై పిహెచ్‌సి డాక్టర్ పర్వీన్‌ను వివరణ కోరగా ఆమె సమాధానం ఇవ్వడానికి నిరాకరించారు.

## చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన యాదగిరి(55) చింతచెట్టుపై నుంచి పడి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. ప్రతాప్ వ్యవసాయ భూమిలోని చింత చెట్టుపై నుంచి కింద పడి మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ప్రచార ర్యాలీ

**-పాల్గొన్న మంత్రి అజారుద్దీన్, ఎంపి సురేష్‌శెట్కార్**

**జహీరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం సంగారెడ్డిజిల్లా నియోజకవర్గం జహీరాబాద్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ, కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. పట్టణంలోని ఎంపి క్యాంప్ కార్యాలయం నుంచి పస్తాపూర్, హుగ్గెల్లి చౌరస్తా, రంజోలు, పస్తాపూర్ చౌరస్తా జాతీయ రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. ప్రచారానికి హాజరైన మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌లు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగాచేసిన హామీలతోపాటు చేయని హామీలను అమలుపర్చి ప్రజల మన్ననలు అందుకుంటున్నారని పేర్కొన్నారు. మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, 200 యూనిట్లు ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యంలాంటి పథకాలు అమలు చేస్తున్నదని ప్రతిపక్షాలకు కానరా వడం లేదా అని ప్రశ్నించారు. రెండేళ్లలో 85000 ఉద్యోగాలను భర్తీ చేసింద న్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భరీ మెజార్టీతో గెలిపించి మున్సిపల్ కార్యాలయంపై కాంగ్రెస్ జండా ఎగరేలా చేయాలని ప్రజలకు వారు సూచించారు.

## హామీలను అమలు చేయని సిఎం

**మాజీ ఎంపి, సినీ నటి నవనీత్‌కౌర్**

**జహీరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** శాసనసభ ఎన్నికల సందర్బంగా చేసిన 420 హామీలను సిఎం రేవంత్‌రెడ్డి అమలుచేయకుండా 420గా మారారని మహారాష్ట్ర అమరావతి మాజీ ఎంపి, సినీనటి నవనీత్‌కౌర్ సిఎం రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం జహీరాబాద్‌లో మున్సిపల్‌లో బిజెపి అభ్యర్థులుగా పోటీచేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన ప్రచారసభలో నవనీత్‌కౌర్ పాల్గొని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఎన్నికల్లో చేసిన హామిలో భాగమైన రైతులకు రైతుబంధు 15 వేలు, మహిళలకు నెలకు 2500, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో 1 తులం బంగారంను అందించకుండా ప్రజలను సిఎం మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 135 మందిరాలను, శివాజీ విగ్రహాలను సిఎం రేవంత్‌రెడ్డి కూల్చేవేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. వచ్చే శాసన సభ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమివేయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులకు మున్సిపల్ తలుపులు తట్టేలా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. సమావేశంలో మాజీ ఎంపి బిబిపాటిల్, ఎన్నికల ఇంచార్జి పైడి ఎల్లారెడ్డి, పిసిసిబి మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, నాయకులు గొల్ల భాస్కర్, సుభాష్‌రెడ్డి, మల్లికార్జున్‌పాటిల్, నౌబాద్ జగన్, అరుణకౌలాస్, టి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపి, సినీ నటి నవనీత్ కౌర్



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న హరీష్‌రావు

## ఓటుకు నోటు కేసులో సిఎంకు జైలుశిక్ష తప్పదు

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు**

**మెదక్, ప్రభాతవార్త ప్రతినిధి**

ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన రేవంత్‌రెడ్డికి జైలుశిక్ష తప్పదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మెదక్ రామదాస్ చౌరస్తావద్ద మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదం వెనుక రేవంత్‌రెడ్డి హస్తం ఉందన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన దొంగ రేవంత్‌రెడ్డికి త్వరలో జైలుశిక్ష ఖాయమన్నారు. జైలుకుపోయే సమయం దగ్గరకు వచ్చినందుకే సాక్ష్యాలు మాయంచేసేందుకు హైదరాబాద్‌లో ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దగ్ధం చేశాడని చెప్పారు. పోలీసుల సహకారంతో ఈ కుట్ర జరిగిందని ఆరోపించారు. హైదరాబాద్‌లో పేదల బతుకులు కూల్చి, జైలుకు పోకుండా ఉండేందుకు సాక్ష్యాలను మాయం చేశా డని ఆరోపించారు. రేవంతు డైరెక్షన్‌లోనే పోలీసులు ఈ దహనకాండ జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల కాలంలో ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. మిర్యాలగూడ, భూపాలపల్లి, నిజామాబాద్ సిఎం పోయిందు కానీ మెదక్‌కు వచ్చేందుకు ముఖం లేదన్నారు. ఏడుపాయల అమ్మ వారి మీద ఒట్టువేసి మాట తప్పిండని, అందుకే ఆయనకు రావడానికి భయంపట్టుకుందన్నారు. రుణమాఫీ చేస్తానని మెదక్‌లో ఏడుపాయల అమ్మవారిపై ఒట్టు వేసి మాటతప్పి మోసం చేసిండన్నారు. రైతు బంధు ఎగ్గొట్టి, రాష్ట్రంలో ఎరువుల కరువు తెచ్చాడన్నారు. అన్నివర్గాల ప్రజలను రేవంత్‌రెడ్డి దారుణంగా మోసం చేసిండన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని కోరారు.

**మల్కాజిగిరి గుండాలతో రౌడీజం...**

మల్కాజిగిరి గుండాలతో మెదక్‌లో రౌడీయిజం చేస్తున్నారని హరీష్‌రావు ఆరోపించారు. మెదక్ ప్రజలు బెదిరిస్తే భయపడరని, మంచితనంతోనే గెల వాలన్నారు. బెదిరింపులకు పాల్పడితే ఇక్కడి ప్రజలు బెదరని చెప్పారు. ప్రజలను గెలవాలంటే ఒక్క మంచితనంతోనే సాధ్యమని, బెదిరింపులకు భయపడేది లేదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, శేరి సుభాష్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్‌లు భట్టి జగపతి, మల్లికార్జున్‌గౌడ్, తిరుపతి రెడ్డి, కృష్ణా రెడ్డి, సురేందర్‌గౌడ్‌తో పాటు బిఆర్ఎస్ అభ్యర్థులు, నేతలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు రామదాసు చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.



మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పశు వైద్యాధికారులు

## విషపు నీరు తాగి గొర్రెలు మృతి

**మర్కుక్, ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో విషపు నీరు తాగి గొర్రెలు మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... మర్కుక్ గ్రామానికి చెందిన రైతు బొమ్మ కరుణాకర్‌కు సంబంధించిన గొర్రెలు రోజులాగే మేతకు వెళ్లి ఆదివారం సాయంత్రం ఇంటికి చేరాయి. అయితే సోమవారం ఉదయం చూసేసరికి ఆరు గొర్రెలు మృత్యువాత పడగా, మరో 48 గొర్రెలు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. విషయం తెలుసుకున్న రైతు వెంటనే పశువైద్యాధికారి డాక్టర్ శిరీషకు, సర్పంచ్‌కు సమాచారం అందించగా ఘటనా స్థలానికి పశువైద్య బృందం డాక్టర్ రమేష్, డాక్టర్ శిరీష, డాక్టర్ భాస్కర్, విఎల్‌వో మహేందర్, విప స్వామిలు చేరుకొని గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవి విషపు నీరు తాగినట్లు నిర్ధారించారు. వెంటనే చికిత్స అందించి 48 గొర్రెలను కాపాడారు. రోజులాగే మేతకువెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న వరి పొలాలలో నీరు తాగడంతోనే ఈ సంఘటన చోటుచేసుకుందని నిర్ధారించారు. ఈ ఘటనతో రైతుకు రూ.లక్ష వరకు నష్టం జరిగినట్లు తెలిపారు. ఆర్థికంగా నష్టపోయిన రైతు కరుణాకర్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ బి.రాణి మల్లేశం, మాజీ సర్పంచ్ భాస్కర్‌లు కోరారు.

## మద్యం అక్రమంగా విక్రయించిన దుకాణం సీజ్

**బహిరంగా ప్రదేశంలో మద్యం తాగిన 8 మందిపై కేసు**

**కొండపాక, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** వెలికట్ట గ్రామ పంచాయతి పరిధిలో అక్రమండా మద్యం విక్రయిస్తున్న దుకాణాన్ని కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్, పంచాయతి కార్యదర్శితో కలిసి సోమవారం సీజ్ చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం వెలికట్ట గ్రామానికి చెందిన రాములు గౌడ్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న సిద్దిపేట సిపి రష్మిపెరుమాళ్ ఈ నెల 5న ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నట్లుగా సిపి గుర్తించి వెంటనే మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేయాలని ఎస్సైని అదేశించారు. సోమవారం సిపి అదేశాల మేరకు అక్రమంగా మద్యం విక్రహించిన దుకాణాన్ని సీజ్ చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలోని దాబాలల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించిన, సిట్టింగ్ ఏర్పాటు చేసిన, బెల్ట్ షాపులు నిర్వహించిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అయన హెచ్చరించారు. అదేవిధంగా బహిరంగా ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 8 మంది వ్యక్తులను సిపి గుర్తించి కేసులు నమోదు చేయించారు. ఎస్, రాజశేఖర్, నలగాం హరీష్, నలగామ శ్రీకాంత్, ఎండి చందు పాషా, వేచరేణి శ్రీనివాస్, మంతెని బిక్షపతి, ఎండి ఉస్మాన్, జబ్బోజు దుర్గయ్యలను జుడిషియల్ కస్టడీకి పంపించినట్లు ఎస్సై తెలిపారు.



మద్యం విక్రయిస్తున్న దుకాణాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

# ముగిసిన ఎన్నికల ప్రచారం.. వార్డుల్లో నిశ్శబ్దం...

**సంగారెడ్డి బ్యూరో 9 ప్రభాతవార్త :**

మున్సిపల్ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. గత వారం నుంచి ప్రచార హోరుతో మారుమోగిన వార్డులు నిశ్శబ్దంగా మారాయి. సోమవారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు జరగమన్న మున్సిపాలిటీలలో పలువురు రాజకీయ నేతలు పర్యటించి వారి అభ్యర్థుల గెలుపు ప్రచారాన్ని చేపట్టారు. వారం రోజులు నుంచి విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు. హోరాహోరీ ప్రచారంతో ఆయా పట్టణాలన్నీ మార్మోగాయి. ప్రధాన పార్టీల నేతలు కార్నర్ మీటింగులు నిర్వహించి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేశారు. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈసారి మున్సిపల్ ఎన్నికలు పార్టీ గుర్తులతో జరుగుతుండడంతో గెలుపు కోసం ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అదేవిధంగా ఆయా వార్డుల్లో పర్యటిస్తూ గెలుపోటములపై బేరీజు వేసుకుంటున్నారు. ఆయా మున్సిపాలిటీలలో పట్టునిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కౌన్సిలర్‌లలో మెజారిటీ స్థానాలను దక్కించుకునేందుకు ప్రధాన పార్టీలు పోటీపడుతున్నాయి. ఓటర్లను ఏదో ఒకరకంగా ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. హోరాహోరీగా కొనసాగిన ప్రచారం... నాయకుల విస్తృత పర్యటన.. ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో ఆదివారం వివిధ పార్టీల నాయకులు పర్యటించారు. జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల పరిధిలోని వార్డులలో పర్యటిస్తూ ఓటర్లను ఆకట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నం చేశారు..

**మొదలైన ప్రలోభాల పర్వం..**

మున్సిపల్ ఎన్నికలకు ప్రచార గడువు ముగియటంతో ఓట్ల కోసం ప్రలోభాల వర్వం మొదలైంది. ఇప్పటికే వార్డుల్లో మద్యం ఏరులై పారుతుంది!. కుల సంఘాల సమావేశాలు ఏర్పాటు చేసి వారికి తాయిలాలు అందిస్తున్నారు. గడువు దగ్గర పడుతుండటంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. అదేవిధంగా వలస ఓటర్ల పైన ఫోకస్ పెడుతున్నారు. పలువురు ఓటర్లు ఇక్కడ ఓటరు జాబితాలో ఉన్నప్పటికీ స్థానికంగా నివాసం ఉండకుండా ఇతర ప్రాంతాల్లో ఉంటున్నవారు వందల సంఖ్యలో ఉన్నారు. వారిని గుర్తించే పనిలో ఆయా వార్డుల నాయకులు నిమగ్నమయ్యారు. అయితే కొంతమంది అదే పట్టణాలలో ఇతర ప్రాంతాలలో నివసిస్తుండగా మరి కొంతమంది ఓటర్లు దూర ప్రాంతాలలో ఉపాధి, విద్య కోసం వెళ్లిన వారు ఉన్నారు. వారికి సంబంధించిన ఫోన్ నెంబర్లు, అడ్రస్ వివరాలు లేకపోవడంతో నాయకులు భయాందోళనకు గురవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కనుక ఒక్క ఓటు కూడా చాలా ముఖ్యమైనదని నాయకులు భావిస్తున్నారు. దీంతో వారిని వెతుకులాటే పనిలో అభ్యర్థులు నిమజ్జనం అయ్యారు. వారికి రానుపోను ఖర్చులను ముందే చెల్లిస్తూ ప్యాకేజీలను ప్రకటిస్తున్నారు. వారికి సంబందించిన చార్జీలను ముట్టజెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. మరి కొంతమంది మాంసం కూడా పంపిణీ వేసే వనిలో నిమగ్నమయ్యారు!. మొత్తానికి ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేకాకుండా కొన్ని మున్సిపాలిటీలలో గల్లీలలో విందులు ఏర్పాటుచేస్తున్నారు. ప్రలోభాల పర్వం మొదలైంది. మద్యం వంపిణీ తో పాటు చికెన్, మటన్లను పంపిణీ వేస్తు న్నారు. ఉద్యోగులకు ప్రత్యేక ప్యాకేజీలను అందిస్తు న్నారు. ప్రచార గడువు ముగియడంతో ఓటర్లను తమవైపు ఆకర్షించేకోనేందుకు పోటీచేస్తున్న పలువురు అభ్యర్థులు ప్రలోభాల పర్వానికి తెర లేపుతున్నారు.

## ఎల్లమ్మ తల్లి వార్షికోత్సవాలు

**మెదక్ జిల్లా, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
మండలపరిధి సూరారం గ్రామంలో శ్రీరేణుకాఎల్లమ్మ ఆలయ నాలుగవ వార్షికోత్సవాలు గౌడసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం రేణుకాఎల్లమ్మ, జమదగ్నిల కళ్యాణం ఘనంగా జరిపారు. మూడురోజుల పాటు నిర్వహించే ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి అలంకరణ, అభిషేకం, కుంకుమార్చన, హోమం వంటి పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం సమర్పించారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు దుర్గాగౌడ్, రాజ్‌కుమార్ గౌడ్, భాస్కర్‌గౌడ్, రామాగౌడ్, కిషన్‌గౌడ్, పవన్‌గౌడ్, నరసింహాగౌడ్, వెంకట్‌గౌడ్, సిద్దిరాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలపండి

**-దోమడుగు వార్డులో ఇంటింటి ప్రచారం**



ప్రచారం నిర్వహిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
బిఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలపాలని, అభివృద్ధి వైపు అడుగు వేయాలని రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ప్రజలను కోరారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు వార్డులో పార్టీ అభ్యర్థుల తరపున ఇంటింటిప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ బిఆర్ఎస్ పార్టీ పాలనలో అమలైన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల సహకారంతో మళ్లీ అభివృద్ధి పాలన సాధ్యమవుతుందని, ప్రతి కుటుంబానికి మేలుజరిగే విధంగా ప్రణాళికలు అమలు చేస్తామని భరోసా ఇచ్చారు.

## వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

**-ఆర్‌డబ్లుఎస్ ఏఈనాగసాయి**



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్‌డబ్లుఎస్ ఏఈ నాగసాయి

**చౌటకూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
వేసవికాలంలో మండల కేంద్రమైన చౌటకూరులో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్లుఎస్ ఏఈ నాగసాయి తెలిపారు. సర్పంచి పార్కల రాంరెడ్డితో కలసి అధికారులు సోమవారం గ్రామంలోని ఆయావీధులలో పర్యటించారు. గ్రామంలోని వీధులలో తాగునీటి సరఫరాకు పైపులైన్ లేమితో ఉన్న వార్డులలో కొత్త పైప్‌లైన్ వేసి నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు నాగసాయి పేర్కొన్నారు. గ్రామంలోని సింగిల్‌ఫేజ్ బోరుమోటార్లు పని చేస్తున్నాయా లేదా అని పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి దమ్మి నాగరాణి కృష్ణ, మాజీ ఉపసర్పంచి కలాలి రామాగౌడ్, వార్డు సభ్యులు చక్రపాణి, మంగలి బాలరాజ్, కృష్ణ, గోరేమియా, లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ-వ్యర్థాల నియంత్రణలో యువత పాత్ర కీలకం

**-టాస్క్ రిసోర్స్ పర్సన్ ఎస్ హేమంత్**

**సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
ఈ-వ్యర్థాల నియంత్రణలో యువత పాత్ర కీలకమని టాస్క్ రిసోర్స్ పర్సన్ ఎస్.హేమంత్ అన్నారు. సోమవారం పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎ)లో తెలంగాణ రాష్ట్ర నైపుణ్యాలు, జ్ఞాన కేంద్రం (టాస్క్) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈ-వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా టాస్క్ రిసోర్స్ పర్సన్ హేమంత్ మాట్లాడుతూ వినియోగంలోకి వచ్చిన మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను నిర్లక్ష్యంగా పారవేయడంతో తీవ్ర ఆరోగ్యసమస్యలు, పర్యావరణ సమస్యలు ఏర్పడుతాయన్నారు. ఈ-వ్యర్థాలలోని విషపదార్థాలు నేల, నీరు, గాలిని కలుషితం చేస్తాయని, ఫలితంగా మానవ ఆరోగ్యానికి హాని చేకూరుతుందన్నారు. ఈ-వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో రిసైక్లింగ్ చేయడం అవసరమని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరు ఈ-వ్యర్థాల నిర్వహణపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రవీణ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ అవసరమన్నారు. కార్యక్రమంలో టాస్క్ కన్వీనర్ డాక్టర్ సుచిత్రాసింగ్, మెంటర్ ఎస్వి రమణ, కెరీర్ గైడెన్స్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కరుణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**మెదక్ జిల్లా, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
మండలపరిధి భాగీర్తిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సోమవారం స్వయంపాలన జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పారు. డిఈవోగా మనీష్, ఎంఈవోగా రక్షిత, ప్రధానోపాధ్యాయులుగా తేజస్విని, ఉపాధ్యాయులుగా సృజన, భానుప్రియ, నవనీత, అఖిల్, ఉపేందర్, నితిన్‌లు వ్యవహరించారు. ఎంఈవో పుష్పవేణి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రెడ్డిలు పాల్గొన్నారు.

## నీటి శుద్ధి యంత్రం ప్రారంభం

**మెదక్ జిల్లా, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
మండలపరిధి సూరారంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం మండల విద్యాధికారిణి పుష్పవేణి, సర్పంచి సావిత్రిలు ఉపసర్పంచి మహిపాల్‌రెడ్డి అందించిన నీటిశుద్ధి యంత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, లక్ష్మి, ఉపసర్పంచి మహిపాల్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భాగీర్తిపల్లిలో మద్యపాన నిషేధం

**మెదక్ జిల్లా, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట మండల పరిధి భాగీర్తిపల్లిలో సోమవారం సర్పంచి సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో మద్యపానాన్ని నిషేధిస్తూ తీర్మానంచేశారు. సర్పంచి సావిత్రి మాట్లాడుతూ గ్రామంలో బెల్టు షాపులతో యువత చెడిపోతున్నారని, కుటుంబసభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామస్థులు విజ్ఞప్తి మేరకు మద్యపానం నిషేధిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి దయానంద్‌యాదవ్, వార్డుసభ్యులు మంజుల, మణెమ్మ, పంచాక్షరి, రామక్రిష్ణ, మహిపాల్‌రెడ్డి, లావణ్య, సంజీవ్‌యాదవ్, సంతోష్, వరలక్ష్మి గ్రామస్థులు పాల్గొన్నారు.

## తపస్ జిల్లా కన్వీనర్‌గా డాక్టర్ పాతూరి స్వప్న

**వెల్దుర్తి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
తపస్ జిల్లా మహిళా కన్వీనర్‌గా డాక్టర్ పాతూరి సప్నను ఎన్నుకోవడం జరిగింది. సోమవారం రాష్ట్ర కార్యవర్గం. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్. దుబాసి భాస్కర్, రామ్‌రెడ్డి, ఎల్లం, సిద్దు, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత కంటిపరీక్షలు




విద్యార్థులకు ఉచిత కంటిపరీక్షలు నిర్వహిస్తున్న కంటివైద్యులు

**వెల్దుర్తి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తిలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య ఆధ్వర్యంలో ఆరో తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సుమారు 400 మంది విద్యార్థులకు ఉచిత కంటిపరీక్షలు నిర్వహించారు. తూప్రాన్ మెడికల్ ఆఫీసర్ సంగీత, సహాయకులు వీర్‌కుమార్‌లు పాల్గొని విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో సుమారు 50మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. వీరికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామని వారన్నారు. అలాగే ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతిరోజు స్నానంచేయడం, భోజనానికి ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని ఆరు విద్యార్థులకు సూచించారు. మనం నివసించే పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సుల్తాన్‌బజార్ పోలీసులకు ప్రశంసలు

**గన్‌ఫౌండ్రి,ఫిబ్రవరి 9ప్రభాతవార్త:**
శాంతిభద్రతలను కాపాడటంతోపాటు విధి నిర్వహణలో అత్యుత్త మ ప్రతిభ కనబర్చిన సుల్తాన్‌బజార్ పోలీసులకు నగర పోలీస్ కమీషనర్ వి.సి.సజ్జనార్ ప్రశంసా పత్రాలను అందచేశారు. పోలీసు కమాండో కంట్రోల్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ కె.నరసింహ, డి.ఐ ధర్మారావు, ఎస్.ఐ సాయిరామ్‌లు నగర పోలీసు కమీషనర్ వి.సి సజ్జనార్ చేతుల మీదుగా ఎక్స్‌ట్రా మైల్, పురస్కారం, గుడ్‌వర్క్ రివార్డులు అందుకున్నారు. ఈసందర్భంగా సుల్తాన్‌బజార్ స్టేషన్ పోలీసు సిబ్బందిని అభినందించారు.

## బస్తీ సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
బస్తీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ఉపకరిస్తుందని జీహెచ్‌యంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నర్కి పూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో చార్మినార్ సర్కిల్లో అక్రమ నిర్మాణంపై ఒక్క ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివా స్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత విభా గాలచే పరిష్కరిస్తున్నామన్నారు. బస్తీ, కాలనీ వాసులు స్థానికంగా నెలకొన్న సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ వెటిర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మలేరియా ఎస్ఈ నామాల శ్రీనివాస్, ఏయంసీ రాజారావు, ఎలక్ట్రికల్ డిఈ సత్యనారాయణరెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ భాను చందర్, సీనియర్ అసిస్టెంట్‌లు మహమ్మద్ హమీద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## విఠలేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

**-ఎమ్మెల్యే తలసాని**

**బేగంపేట ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**
ఎంతో పురాతన మైన విఠలేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆలయ నిర్వహకుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే తలసాని రాంగోపాల్‌పేట డివిజన్ ఓల్డ్‌బోయిగూడా లోని విఠలేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించారు. స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజల అనంతరం నిర్వహకులు ఎమ్మెల్యేని సన్మా నించి తీర్థ ప్రసాదాలను అందజేసారు. ఈ సందర్భంగా ఆలయం లో చేపట్టవల్సిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి మల్లిఖార్జున్ గౌడ్, అరుణాశ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కిషోర్ , రామ్మోహన్ , నాగులు, కొండాపురం మహేష్‌యాదవ్, టీను గౌడ్, ఒడెల సత్యనారాయణ, చంద్ర ప్రకాష్, ఆలయ నిర్వహకులు నాగరాజు, శ్రీధర్, జయసూర్య , అరుణ్ మహరాజ్‌లు ఉన్నారు.

## బాక్స్ డ్రైను పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే

**అల్వాల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
బాక్స్ డ్రైన్‌లు ఏర్పాటు ద్వారా వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం లభిస్తుందని మల్కా జిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అల్వాల్ డివిజన్ పరిధిలోని దినకర్ నగర్‌లో 2.3 కోట్లు వ్యయం తో ఏర్పాటు చేయనున్న బాక్స్ డ్రైన్ పనులను స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. వర్షా కాలం లోపు పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలలో డిఇ ప్రశాంతి, ఎఇ అరుణ్ బిఆర్ఎస్ నేతలు ప్రేమ్ కుమార్, యాదగిరి గౌడ్, మహేష్, సాజిద్, సెల్వరాజు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి

**-జిహెచ్ఎంసి కమీషనర్‌కు కార్పొరేటర్లు వినతి**

**అల్వాల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
తమ డివిజన్లలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అల్వాల్ సర్కిల్‌కు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు జిహెచ్ఎంసి కమీషన్‌కు వినతి పత్రం అందించారు. సోమవారం కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత అనీల్ కిషోర్‌లు కమీషనర్ కర్ణన్‌ను కలిసి సమస్యలను వివరించారు. అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, ప్రజా సమస్యలు పరిష్కారానికి సహకరించాలని వారు కోరారు.

## ఈనెల 11వ తేదీన మాజీసైనికుల సమావేశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
మాజీసైనికుల సమస్యల పరిష్కారానికి ఆర్మీ నుండి కొందరు అధికారులు సోమాజీగూడా లోని ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయానికి ఈ నెల 11వ తేదీన ఉదయం 11గంటలకు విచ్చేయనున్నారు. ఎవరైనా మాజీసైనికులు పెన్షన్ సమస్యలు, ఇతర సమస్యలు ఉన్నట్లయితే వారు సోమాజీగూడాలోని ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయానికి హాజరై వారి సమస్యలు పరిష్కరించు కోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరి కోరారు.

## అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి గ్రీన్ సిగ్నల్

**-జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కోరిన కార్పొరేటర్ పావని వినయ్ కుమార్**

**చిక్కడపల్లి ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
గాంధీనగర్ డివిజన్ పరిధిలో మంజూరైన నిధులతో పూర్తయిన అభి వృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ ఎ. పావని వినయ్ కుమార్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ను కోరారు. ఈ మేరకు సోమ వారం కమిషనర్‌ను బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్ తో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రభుత్వం కేటాయించిన రూ. 2 కోట్ల కార్పొరేటర్ నిధులలో ఇప్పటికే రూ. 1 కోటితో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, వాటిని వెం టనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. మిగిలిన రూ. 1 కోటి నిధులను కూడా వెంటనే విడుదల చేసి, డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న ఇతర అభివృద్ధి పను లకు వెచ్చించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ వినతిపై సానుకూలంగా స్పందించిన కమిష నర్, పూర్తయిన పనుల ప్రారంభోత్సవానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని, పెండింగ్‌పనుల పూర్తికి ప్రత్యేకచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిసికి వినతి

**నార్సింగి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
పాత బండ్లగూడ కార్పోరేషన్ ఐదో డివిజన్‌లో ఆమోదం తెలిపిన పనులను త్వరగా పూర్తి చేయాలని డిసి సురేందర్‌రెడ్డికి మాజీ కార్పోరే టర్ శ్రీనాథ్‌రెడ్డి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సాయిరాం ఎన్‌క్లేవ్‌లో కమ్యూని టీహాల్, ఓపెన్‌జిమ్, సాయిహర్ష కాలనీలో డ్రైనేజి, రోడ్డు పనులు, కపిలానగర్‌లో రోడ్డు, హీరానగర్‌లో డ్రైనేజి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని త్వరగా పూర్తి చేయాలని డిసిని కోరినట్లు వివరించారు. ఈ పనులను ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఆమోదంతోనే తీర్మాణాలు చేశామని తెలిపారు. వినతి పత్రం అందుకున్న డిసి సురేందర్‌రెడ్డి స్పందిస్తూ వెంటనే ఈ పనులను ప్రారంభిస్తామని హామీనిచ్చారని శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. డిసి స్పందన పట్ల ఆయన ఆనందంను వ్యక్తం చేశారు. డిసిని కలిసిన వారిలో మాజీ కార్పోరేటర్ సాగర్‌గౌడ్, పలువురు కాలనీ ప్రజలు తదితరులు ఉన్నారు.

## గురుమూర్తి లేన్‌లో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**బేగంపేట ఫిబ్రవరి 9,ప్రభాతవార్త**
బేగంపేట డివిజన్ పరిధిలోని గురుమూర్తి లేన్ లో రూ 10లక్షలతో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి భూమిపూజ చేసా రు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ లో ఇప్పటి వరకు ఎన్నో అబివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసా మన్నారు. గురుమూర్తిలేన్‌లో రోడ్డు దెబ్బతిన్న విషయాన్ని స్థానికులు తన దృష్టికి తీసుకు రావడంతో రూ 10లక్షల నిధు లతో నూతనంగా రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసా మన్నారు. వీలైనంత త్వరలో రోడ్డు నిర్మాణాన్ని నాణ్యతగా పూర్తి చేస్తామని కార్పొరేటర్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.శ్రీహరి, నాగు రఘునాథ్, నరేష్, జాండ్లకృష్ణ, సుదర్శన్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బోరబండలో ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్తః**
బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరిపై బోరబండ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. బోరబండ వినాయకనగర్‌లో నివసించే రామస్వామి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతని ఇంటి పక్కన నివసించే బాలయ్య, రవి ఇద్దరు ఇంటి నిర్మాణ పనులు చేపడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నిర్దిష్టమైన ప్రమాణాలు, రక్షణ చర్యలు పాటించకుండా నిర్మాణాలు చేపట్టేందుకు జేసీబీ వినియోగించడంతో పక్కనే ఉన్న రామస్వామి నివాసంలో ఆయా నిర్మాణ వ్యర్థాలన్ని పడుతున్నాయి. ఇటుకలు పడటంతో రామస్వామి కుమార్తె, కోడలుకు గాయలయ్యాయి. దీంతో వారిని ప్రశ్నించేందుకు వెళ్లగా కులం పేరుతో దూషించడమే కాకుండా చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. రామస్వామి ఫిర్యాదు మేరకు బాలయ్య, రవిలపై పోలీసులు 352, 351(2) బీఎన్ఎస్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రంజాన్ మాసంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

**జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి**

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**
రానున్న రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పారిశుధ్య నిర్వాహ ణపై ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్ఎంసి చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నర్కి పూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్లు, పారిశుధ్య విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లా డుతూ రంజాన్ మాసంలో ప్రార్థనా మందిరాలు, జనసం వర్థక ప్రాంతాలలో ఎప్పటికప్పుడు చెత్తను తరలించేం దుకు చర్యలు తీసుకుంటామన్నారు. జోన్ పరిధిలోని ఐదు సర్కిల్లో 15 వాహనలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి వాహనంలో ముగ్గురు చొప్పున సిబ్బంది ప్రతిరోజు మూడు షిఫ్టుల్లో అందుబాటులో ఉంటూ నెల రోజుల పాటు పనిచేస్తారని తెలిపారు. బస్తీలలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. నెల రోజుల పాటు జరిగి ఉపవాస దీక్షల సందర్భంగా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాల ని సూచించారు. ఈ సమావేశంలో మలక్‌పేట్, సంతోష్ నగర్, యాకుత్‌పురా, చార్మినార్, మూసారంబాగ్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు ఇంకేషఫ్ అలీ, మంగ తయారు, సుభాష్, సరిత, భాస్కర్ రెడ్డి, ఎస్‌డబ్ల్యూఎం డీఈలు వెంకట్ రాజు, నవీన్ కుమార్, రంజిత్‌రెడ్డి, శ్రీరాములు, రాంకీ సంస్థ జోనల్ ఇంచార్జి నందకిశోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నాణ్యతతో సిసి రోడ్డు పనులు చేపట్టాలి

**ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
అంబర్‌పేట నియోజకవర్గంలో చేపడుతున్న సిసి రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు బాధ్య త వహించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం అంబర్‌పేట్ డివిజన్ ప్రేమ్‌నగర్ చౌరస్తా రోడ్డు లైన్‌లో రూ.80 లక్షలతో సిసి రోడ్డు పనులు, బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జున్ నగర్‌లో రూ.30 లక్షలు, తురాబ్‌నగర్‌లో రూ.10 లక్షలు, భరత్‌నగర్‌లో రూ10 లక్షలతో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారం భించారు. ఈ ప్రారంభోత్స వ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డిలు పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్యే సిసి రోడ్డు ప్రారంభోత్స వ బస్తీలలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ...అభివృద్ధి పనుల పట్ల అధికారులు పర్యవేక్షణ అవసరమని, అధికారుల నిరక్ష ్యం తగదన్నారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సకాలంలో నిర్మాణ పనులను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రోడ్డు తవ్వి వదిలేయకుండా సకాలంలో సిసి రోడ్డు పనులు చేపట్టి స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అలీ కేఫ్ దుర్గ నగర్, ప్రేమ్ నగర్‌లో పర్యటించి స్థానికంగా ఉన్నటువంటి డ్రైనేజీ సమస్యలను, మరియు విధి దీపాల సమస్యలను, విద్యుత్ పోల్ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడుతూ స్థానికంగా వీధిదీపాల సమస్య, పాడైపోయిన విద్యుత్ స్తంభాలను, డ్రైనేజీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలను సత్వరం పరిష్కరించా లని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఈ ప్రవీణ్, ఏఈ పవన్, ఏఈ ప్రదీప్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ దుర్గ మరియు బీఆర్ఎస్ పార్టీ అంబర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముది రాజ్, ప్రధాన కార్యదర్శి జాఫర్, పార్టీ సీనియర్ నాయకులు, లవంగం ఆంజనేయులు, లింగారావు, రామారావు యాదవ్, మల్లేష్ యాదవ్, రంగు సతీష్ గౌడ్, మహేష్ ముదిరాజ్, మల్లికార్జున్ యాదవ్, జాకీ బాబు, పాక సంతోష్, రఫిక్, నాయకులు, బాగ్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, శ్రీరాములు ముదిరాజ్, ప్రముఖ న్యాయవాది నర్సింగ్, మిర్యా ల శ్రీనివాస్, రవీందర్, అంబర్ పేట్ డివిజన్ అధ్యక్షుడు సిదా ్ధర్థ ముదిరాజ్, ఉద్యమకారుడు మల్లికార్జున్ యాదవ్, సీనియర్ నాయకులు ఉంగరాల మల్లేష్ యాదవ్, స్థానిక బస్తీ వాసులు, జిహెచ్ఎంసి, జలమండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలు సమాజ సేవకు దోహదం

**అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
ఉచిత వైద్యశిబిరాలు, సమాజ సేవకు ఎంతగానో, దోహదం చేస్తాయని బిజెపి గొల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు టి.ఉమామహేంద్ర పేర్కొన్నారు. సోమవారం మురళీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్, కేర్ ఆసుపత్రి సహకారంతో, పేద రోగులకోసం, ఉచిత వైద్యశిభిరాన్ని నిర్వహించారు. ఉచిత వైద్యశిభిరాన్ని గోల్కొండ జిల్లా అధ్యక్షులు ఉమామహేంద్ర, మురళీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్‌సింగ్, కార్యదర్శి యు.ప్రదీప్‌కుమార్‌లతో కలిసి ప్రారంభిం చారు. వారు మాట్లాడుతూ ఒక మంచి ఆలోచనతో, ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడి, ప్రతి ఒకరు అనే అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించి, ప్రతి పేదవానికి ఉచితంగా వైద్య శిభిరం నిర్వహించడంతోపాటు మొదటిసారి విజయవంతంగా నిర్వహించుకుంటూ ముందుకువెళ్లడం గొప్ప విషయమన్నారు. ఉచితంగా కంటి, షుగర్, బి.పి, టూడిఈకో, ఇ.సి.జి, దంత వైద్య పరీక్షలతోపాటు రక్తపరీక్షలు ఉచితంగా నిర్వహించా రు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులుడి. సురేందర్ మాదిగ, ప్రవీణ్‌కుమార్, మురారీ అగర్వాల్, యు.శ్రీనివాస్ రా జేష్‌సింగ్, బబ్లు, కిరణ్, వైద్యబృందం కో-ఆర్డినేటర్ సయ్యద్ పాషాపహిల్వాన్, సంతోష్‌శుక్లా, మన్సూరఅశ్వాక్, డాక్టర్ సీమా, శాంతి, జ్యోతి వైద్యసేవలను అందించారు.

## కన్యకాపరమేశ్వరీ దేవాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు..

**బేగంపేట ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని ఆవుల మంద శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయోద్ధరణ, పున;ప్రతిష్టా మహా కుంభాభిషేక మహోత్సవాలను ఈనెల 22 వతేదీ ప్రారంభమవుతాయని దేవాలయ కమిటీ స్పష్టం చేసింది. సోమవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దేవస్థానం సంఘం అధ్యక్షులు చందా బాలేందర్, దేవాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సోమా ఆనంద్‌కుమార్‌లు విలేఖరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. 22వ తేదీ ఉదయం గం 7.45లకు పూజలు మొదలవుతాయన్నారు. 26న హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి చేతులుమీదుగా ప్రాణప్రతిష్ట కళాన్యాసము, మహా కుంభాభిషేకము మొదలైన పూజలతో పున;ప్రతిష్టా కార్యక్రమం జరుగుతుందన్నారు.

### వాస్తవాలకు దూరంగా ఆరోపణలు....

400ఏళ్ల చరిత్ర కలిగిన వాసవి కన్యాకాపరమేశ్వరిదేవి దేవాలయం పూర్తిగా శిధిలావస్థకుచేరి వర్షంనీరు దేవాలయం లోపల కురిసేవని, మురుగు నీరు గర్భగుడి వరకు వచ్చేవని చెప్పారు. 2017లో ఎన్నికల ద్వారా ఎన్నికైన కమిటీ ఆలయాన్ని అభివృద్ది చేస్తుందని నమ్మకంతో 2002లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో అభివృద్ధి కమిటీని ఏర్పాటుచేసి జీర్ణోద్ధరణకు పూనుకున్నామని చెప్పారు. దేవాలయ జీర్ణోద్ధరణ ఇష్టంలేని కొందరు కమిటీకి దురుద్దేశాలను అంటగట్టి అమ్మవారి ఆలయ అబివృద్ధిని అడ్డుకుంటున్నారని వారు ఖండించారు. రూ 4.48కోట్లు దేవాలయానికి విరాళాలురాగా రూ3.90కోట్లు ఖర్చు చేసామని చెప్పారు. మళ్లీ ఇంకో వెయ్యేళ్లు చెక్కుచెదరకుండా దేవాలయాన్ని నిర్మించామన్నారు. కన్యకా పరమేశ్వరీ దేవాలయానికి దేవదాయ శాఖ అనుమతులు అవసరం లేదని స్థపతి ఆమోదం తెలిపారు. దేవాలయం ప్రాంతం లీజు ల్యాండు కాదని ఎస్టేట్ అధికారులు తేల్చి చెప్పారని తెలిపారు. దేవాలయంలో సభ్యులు కూడా కానీ వారు ఇప్పుడు ఆరోపణలుచేస్తున్న దేవాలయ అభివృద్ధిని అడ్డుకుంటూ అధికారులు, న్యాయస్థానాలను ఆశ్రయించడం పట్ల హిందువులందరూ ఆగ్రహం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో దేవస్థాన ప్రధానకార్యదర్శి తమ్మి వెంకటేష్, కోశాధికారి ఎం.శరత్‌బాబు, వైశ్యప్రముఖులు పాల్గొన్నారు.

## బళ్లారి రాఘవ ఆశయ సాధనే కళాకారులకు నిజమైన నివాళి

**సిరికొండ మధుసూదనాచారి**

**చిక్కడపల్లి ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
ప్రముఖ న్యా యవాది, నాటక రంగ ప్రముఖులు బళ్లారి రాఘవ యాదిలో సభ త్యాగరాయ గానసభ వేదికగా ఎందరో మహానుభావులు మధుర స్మృతులు కార్యక్రమంలో తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ సహకారంతో సోమవారం జరిగింది. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన్‌మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నాటక రంగానికి బళ్లారి రాఘవ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన నటన కేవలం వినోదం కోసమే కాకుండా సమాజ హితం కోసం సాగిందని కొనియాడారు. ఈసభలో ప్రముఖ పాత్రికేయులు జయసూర్య, తెలంగాణ వికలాంగుల సంస్థ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు మల్లం రమేష్ తదితరులు పాల్గొని రాఘవ వ్యక్తిత్వాన్ని, రంగస్థల ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు.

## భక్తిపారవశ్యంలో వినాయక విజయం హరికథా గానం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
ప్రముఖ హరికథా విద్వాంసురాలు భగవతారిణి వెంకటనాగసింధు అందించిన వినాయక విజయం హరికథా గానం ప్రేక్షకులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. వినాయకుడి జననం, గజాసుర సంహారం మరియు విఘ్నేశ్వరుడిగా ఆయన పొందిన కీర్తిని హరికథ భగవతారిణి వెంకట నాగసింధు ( ప్రొద్దుటూరు ) తన గాత్రంతో, అద్భుతమైన కథా ప్రవచనంతో కళ్లకు కట్టినట్లు మధురగాన నటన నాట్య మిళితంగా చెప్పి ఆకట్టుకున్నారు. సోమవారం నల్లకుంటలోని శృంగేరి శంకరమఠంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రభు త్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి జన్మదినోత్సవాలను పురస్కరించుకుని 'హరికథా మహోత్సవాల'లో భాగంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ బి. భవానిప్రసాద్ హాజరై ప్రసంగించారు. వేదికపై విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కెవి.రమణాచారి, జాయింట్ మెట్రో పాలిటన్ కమీషనర్ శ్రీవత్స కోట, కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కార గ్రహీత దాసరి వెంకటరమణ కిన్నెర సంస్థ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్, వెంకటరావు, రాధాకృష్ణ, సతీష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. హరికథాగానానికి వయోలిన్‌పై ధూళిపాల శ్రీనివాసమూర్తి, మృదంగంపై రాయప్రోలు సుధాకర్ వాద్య సహకారాన్ని అందించారు.

## విద్యార్థులకు బంగారు పతకాలు ప్రధానం

**అత్తాపూర్ ఫిబ్రవరి9,ప్రభాతవార్త :**
వ్యవసాయ విశ్వవి ద్యాలయం నిర్వహిం చిన 56,57,58 సం యుక్త స్నాతకోత్స వంలో 64 మంది అండర్ గ్రాడ్యుయే ట్స్ కి, 26 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్స్‌కి, ఆరుగురు పీహెచ్‌డీలకు బంగారు పతకాలను ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, వ్యవసాయ నిపుణులు ప్రభు పింగళి అందజేశారు. 56వ స్నాతకోత్సవానికి సంబంధించి బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) విద్యార్థిని గన్నేరపు నవ్య ఆరు బంగారు పతకాలు సాధించింది. అలాగే 58వ స్నాతకోత్సవానికి సంబంధించి బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) విద్యార్థిని స్నేహలత ఏడు బంగారు పతకాలని సాధించింది. బీఎస్సీ(అగ్రికల్చర్) విద్యార్థిని మారం సంజన 5 బంగారు పతకాలు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ తమ బిడ్డలతో ఫోటోలు దిగారు.

## యుపిఎస్‌సీ పరీక్షలు విజయవంతంగా పూర్తి

**:జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**
యుపిఎస్‌సీ పరీక్షలు విజయవంతంగా పూర్తి అయ్యాయని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం జరిగిన యుపిఎస్‌సీ ఇంజనీరింగ్ సర్వీసెస్, అలాగే కంబైన్డ్ జియో సైంటిస్ట్ పరీక్షల నిర్వహణపై రెవెన్యూ సూపర్వైసర్లు, లోకల్ ఇన్స్పెక్టింగ్ ఆఫీసర్లు అలాగే లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో డీబ్రీఫింగ్ సమావేశంలో పాల్గొని సమీక్షించారు. పరీక్షలలో అభ్యర్థులకు ఏ ఇబ్బందులు లేకుండా సజా వుగా నిర్వహించినందుకు సంబంధిత అధికారులను అభినందించారు. రాబోయే పరీక్షలలో కూడా అందించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సహకరించాలని సూచించారు. అభ్యర్థులకు పరీక్షాప్రక్రియ సులభతరం చేయడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని కేంద్రాల నియమించిన వెన్యూ సూపర్వైజర్లు, లోకల్ ఇన్స్పెక్టింగ్ ఆఫీసర్లు, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయహుండీ ఆదాయం రూ.2 లక్షల50వేల148

**చిక్కడపల్లి ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంహుండీ లెక్కింపు సోమవారం జరిగింది. ఆలయం పునర్నిర్మాణ కమిటీ ఛైర్మన్ జానకి సుధాకర్, ఈఓ మాచర్ల దేవనాథం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ బి. సురేఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ హుండీ లెక్కింపు ద్వారా మొత్తం రూ. 2లక్షల50వేల148 ఆదాయంరాగా ఇందులో ఈహుండీ ద్వారా రూ.12 వేల 507 వచ్చింది. హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయం అభివృద్ధికి వెచ్చించడం జరుగుతుందన్నారు. దాతలు ముందుకు వచ్చి ఆలయం అన్నిరంగాలలో అభివృద్ధికి భక్తుల మనోభావాలకు అనుగుణంగా ముందుకుసాగే విధంగా తోడ్పాటును అందించాలని కోరారు. కార్యక్రమంలో ముషీరాబాద్ తహాశీల్దార్ గరికె ఉపేందర్ రావు, ప్రధాన అర్చకులు బుగ్గ లక్ష్మీపతి శర్మ, కందాళ వంకటాద్రి పాల్గొన్నారు.



మాట్లాడుతునన హరీష్‌రావు. పక్కటన ఎమ్మెల్యే సునీతారెడ్డి

## కాంగ్రెస్‌కు చరమగీతం పాడదాం

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**నర్సాపూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** హామీలు అమలు చేయని అబద్దాల కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడదామని సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. సోమవారం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నర్సాపూర్ లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఎదుట కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రముఖ్యమంత్రి చంద్రబాబులు బడేమియా చోటేమియాలా అనుబంధం ఉందన్నారు. దీంతో కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రకు నిధులు కేటాయించగా, తెలంగాణకు గుండు సున్న ఇచ్చిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నర్సాపూర్ అభివృద్ధికి ఎటువంటి నిధులు కేటాయించలేదని ఆయన విమర్శించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి నర్సాపూర్‌కు వచ్చి హామీలు ఇస్తున్నారని ముందు ఆయన నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే సునీతరెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. ప్రజలు బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి నర్సాపూర్ మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరవేయాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు బిఆర్ఎస్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారిని ఒక్కొక్కరిని పిలిచి ప్రజలకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మండల అధ్యక్షులు భోగ శేఖర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ శివకుమార్, కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు.

## 9వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

### కాంగ్రెస్ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి శ్రీధర్‌గుప్త



ప్రచారం చేస్తున్నకౌన్సిలర్ అభ్యర్థి పైడి శ్రీధర్ గుప్త

**నర్సాపూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డును అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆ వార్డు కాంగ్రెస్ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి పైడి శ్రీధర్‌గుప్త అన్నారు. సోమవారం 9వ వార్డులో ఇంటింటి ప్రచారానికి అపూర్వ స్పందన లభిస్తుంది అంతేగాక పట్టణంలోని చైతన్యపురి కాలనీ నుంచి ప్రజలు భారీ ర్యాలీగా బయలుదేరి శ్రీధర్‌గుప్తాకు మద్దతుగా 9వ వార్డులో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌గుప్తా మాట్లాడుతూ 9వ వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ప్రజలు ఆశీర్వదించి కౌన్సిలర్‌గా గెలిపించాలని కోరారు. కౌన్సిలర్‌గా గెలిపిస్తే తొమ్మిదో వార్డు అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## 13వ వార్డులోని సమస్యలను పరిష్కరిస్తా

### బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి బుచ్చేష్ యాదవ్



ప్రచారం చేస్తున్న బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి బుచ్చేష్ యాదవ్

**నర్సాపూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులోని సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేస్తానని బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి బుచ్చేష్‌యాదవ్ అన్నారు. సోమవారం వార్డులో భారీ ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బుచ్చేష్‌యాదవ్ మాట్లాడుతూ గతంలో నర్సాపూర్‌లోని పదో వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికై ఆ వార్డులో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించానన్నారు. అదేవిధంగా ఈ 13వ వార్డులోనూ సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తానన్నారు. బిజెపి గుర్తు కమలం పువ్వుకు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను బుచ్చేష్ యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు వార్డు ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి.. 14వ వార్డులో సమస్యలు పరిష్కరిస్తా

### కౌన్సిలర్ అభ్యర్థి సరళా ఆంజనేయులుగౌడ్



ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థి సరళాఆంజనేయులుగౌడ్ తదితరులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలిపిస్తే సమస్యలను పరిష్కరిస్తానని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి దుర్గప్పగారి సరళ ఆంజనేయులు గౌడ్ ప్రజలను కోరారు. సోమవారం ఆమె కాంగ్రెస్ నాయకులతో కలిసి 14వ వార్డులో చాకలిబస్తీలో ఇంటింటికి తిరుగుతూ తనకు కేటాయించిన చేతి గుర్తుపై ఓటువేసి కౌన్సిలర్‌గా గెలిపించాలని ప్రజలను కోరారు. కౌన్సిలర్‌గా గెలిపిస్తే ప్రభుత్వం నుంచి అధిక నిధులు తీసుకువచ్చి 14వ వార్డును అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆమె ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి, శేఖాగౌడ్ పాల్గొన్నారు.

## మృత్యుంజయస్వామి దేవాలయంలో మహా శివరాత్రి వేడుకలు

**కోహెడ, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :**

మండలంలోని సముద్రాలగ్రామంలోగల శ్రీవరసిద్ధి మహా మృత్యుంజయ స్వామి దేవాలయంలో మహా శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 14, 15, 16 తేదీలలో మూడురోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఫిబ్రవరి 14న గణపతి పూజ, నవగ్రహ మృత్యుంజయ హోమం, స్వామివారికి అభిషేకం, కళ్యాణం, అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం ఊరేగింపు జరుగుతాయని, ఫిబ్రవరి 15న ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు, పగలు అన్నదానం, రాత్రి లింగోద్భవం, జాగరణ కార్యక్రమాలు నిర్వహిస్తారని, 16న అన్నపూజ, అలంకరణ, తీర్థ ప్రసాదం, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాగిన అనంతరం జరిగే హోమం, కళ్యాణ కార్యక్రమాలలో పాల్గొవిలనుకునే దంపతులు ముందుగా తమ వివరాలు తెలియజేయాలని దేవాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

# వేడెక్కిన హుస్నాబాద్ రాజకీయం...!

* ముున్సిపల్ ఎన్నికల్లో ప్రలోభాల జోరు
* ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలు చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులు
* చికెన్, మటన్, మద్యం, నగదు పంపిణీ
* కొరవడిన ఎన్నికల సంఘం, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల పర్యవేక్షణ




**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎలాగైనా విజయం సాధించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులు, చికెన్, మటన్, మద్యం వంటివాటిని పంపిణీచేస్తూ ఓట్లు అడుగుతున్నారని స్థానికంగా తీవ్రంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నప్పటికీ, కొంతమంది అభ్యర్థులు, వారి అనుచరులు నిబంధనలను పక్కనపెట్టి రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా ఈ తరహా ప్రలోభాలకు పాల్పడుతున్నారని అందిన సమాచారం మేరకు తెలుస్తోంది. ముఖ్యంగా కొన్ని వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ నగదు పంపిణీ చేయడం, మద్యం బాటిళ్లు, మాంసాహారం ప్యాకెట్లు, బిర్యానీ ప్యాకెట్లు అందజేస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పరిణామాలపై హుస్నాబాద్ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన ఎన్నికల్లో డబ్బు, మద్యం రాజకీయాలు హావభావాలు దక్కించుకుంటున్నాయంటూ పలువురు విమర్శిస్తున్నారు. ఓటు అనేది ప్రజాస్వామ్యంలో పవిత్రమైన హక్కు అని, దాన్ని కొనుగోలు చేయాలనే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది పక్కన పెడిదే అధికార, ప్రతిపక్ష నాయకులు కొంత ఎలాగైనా గెలుపొందాలనే ఉద్దేశంతో పట్టణంలోని కొన్ని ఫంక్షన్‌హాల్‌లు అద్దెకు తీసుకుని యువతకు జోరుగా దావత్‌లు ఇస్తున్నట్లు వినిపిస్తుంది. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని మేధావులు వాపోతున్నారు. మరోవైపు, ఇలాంటి ప్రలోభాల వల్ల యువకులు, ఓటర్లు, నిరుద్యోగులు తప్పుదారి పట్టే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాత్కాలిక లాభాల కోసం భవిష్యత్తును తాకట్టు పెట్టకూడదని పౌర సంఘాలు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఈ అంశంపై ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి చర్యలు కనిపించకపోవడం గమనార్హం. ఎన్నికల సంఘం, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల నియమావళి ప్రకారం మరింత కఠినంగా పర్యవేక్షణ చేపట్టి, ప్రలోభాలకు పాల్పడే అభ్యర్థులు, పార్టీలపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికలు ప్రలోభాల రాజకీయానికి నిదర్శనంగా మిగిలిపోయే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో సంబందిత అధికారులు ఏవిధంగా వ్యవహరిస్తారో వేచిచూడక తప్పదు.

## ఎన్నికల నిర్వహణకు పోలీసు బందోబస్తు

### -గజ్వేల్ ఎసిపి నర్సింలు

**గజ్వేల్, ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయడం జరుగుతుందని గజ్వేల్ ఏసిపి నర్సింలు పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందన్నారు. ఐదుగురు లేదా అంతకన్నా ఎక్కువ వ్యక్తులు గుంపులుగా గుమికూడరాదని పేర్కొన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు నుండి పోలింగ్ పూర్తయ్యే వరకు సైలెంట్ పీరియడ్ అమలులో ఉంటుందని, ఈ సమయంలో ఎన్నికల సభలు, సమావేశాలు, ఇంటింటా ప్రచారం, లౌడ్‌స్పీకర్‌ల వినియోగం, ర్యాలీలు, బైక్ ర్యాలీలు పూర్తిగా నిషేధం అన్నారు. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల లోపల, ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వెళ్లే మార్గంలో లేదా దానికి సంబంధించిన వీధుల్లో ఎలాంటి ప్రచారం, అడ్డంకులు, ఉద్రేకం లేదా ప్రలోభాలను సృష్టించవద్దన్నారు. పోలింగ్‌స్టేషన్ ప్రాంగణంలో వంద మీటర్ల పరిధి లోపల ఫోన్‌లు, కార్డ్‌లెస్ ఫోన్‌లు, వైర్‌లెస్ సెట్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించడానికి లేదా తమ వద్ద ఉంచుకోవడానికి అనుమతి లేదని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల భద్రత దృష్ట్యా ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల నుండి ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్ పూర్తయ్యే వరకు మద్యం దుకాణాలను బంద్ చేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా మద్యం అక్రమంగా రవాణా చేసినా, నిల్వ చేసినా కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రం లోపలికి ఓటరుకార్డు లేదా ఆధార్‌కార్డు మాత్రమే అనుమతించబడుతుందన్నారు. పోలింగ్‌స్టేషన్‌లోకి ఎలాంటి వస్తువులను తీసుకెళ్లవద్దని ఓటర్లకు సూచించారు. పోలింగ్ పూర్తయ్యే వరకు పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో స్థానికేతరులు, బయట వ్యక్తులు ఎవరూ ఉండవద్దన్నారు. ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే అక్కడి నుండి వెళ్లిపోవాలని సూచించారు. ఎన్నికలు స్వచ్ఛంగా, ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

### -ఎంపిడివో వేణుగోపాల్‌రెడ్డి

**జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త):**

మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిడివో పి.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా కలెక్టర్ ద్వారా ప్రొసీడింగ్ ఇచ్చిన ప్రతి లబ్ధిదారు ఇళ్లు నిర్మించుకునేలా గ్రామస్థాయిలో చర్యలు చేపట్టాలని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అదేవిధంగా గ్రామంలోని ఉపాధి హామీ పనులలో భాగంగా వ్యవసాయ పొలాల వద్దకు మట్టి రోడ్డు వేసుకునే అవకాశాలు ఉన్నందున ఎక్కువ మొత్తంలో కూలీలు ఉపాధిహామీ పనిలో భాగమై రోడ్లు వేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీ, ఉపాధిహామీ పనులను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ ఓంప్రకాష్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఎంపిడివోను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుర్రె మల్లికార్జున్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపిడివో వేణుగోపాల్‌రెడ్డి



ఇంటింటా ప్రచారం చేస్తున్న అనసూయ అశోక్‌గౌడ్

## 13వ వార్డులో అనసూయ అశోక్‌గౌడ్ ఇంటింట ప్రచారం

**నర్సాపూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి అనసూయ అశోక్‌గౌడ్ సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుంది. కౌన్సిలర్ అభ్యర్థి అనసూయ అశోక్‌గౌడ్ 13వ వార్డులో మహిళలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ఓటర్లను ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## అల్లాదుర్గంలో చిరుత సంచారం



అల్లాదుర్గంలో చిరుతపల్లి సంచరిస్తున్న దృశ్యం

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సోమవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో చిరుతపుల్లి కలకలం రేపింది. పట్టణంలోని ఐబి చౌరస్తా వద్ద చిరుత పులి సంచరిస్తున్నట్లు ప్రజలు గమనించి తమ సెల్ ఫోన్లలో బంధించారు. చిరుతపులి సంచరిస్తున్నట్లు గ్రామస్థులకు తెలుసుకుని భయాందోళనకు గురయ్యారు. అటుగా వాహనాలు పెద్దశబ్దంతో తిరుతుతుండటంతో శబ్దానికి పులి అక్కడి నుంచి పరారైంది. ప్రజలు పులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

## ఘనంగా మల్లన్న జాతర

**వెల్దుర్తి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** మండలంలోని సిరిల గ్రామ పంచాయతీలో సోమవారం కురుమ కులస్తుల ఆరాధ్య దైవమైన మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లన్న స్వామికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పెద్ద సంఖ్యలో బోనాల ఊరేగింపు నిర్వహించి అలాగే అగ్నిగుండం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ జాతర ఉత్సవానికి పరిసర ప్రాంతం ప్రజలు భక్తులు పాల్గొని వారి యొక్క మొక్కలను తీర్చుకున్నారు.



మల్లన్న జాతరలో అగ్నిగుండం నిర్వహిస్తున్న పూజారులు

# హామీలను నెరవేర్చని కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలి

### ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్



ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయని నాయకులకు, పార్టీకి తగిన గుణపాఠం చెప్పే అవకాశం వచ్చిందని ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్‌రావు, మాజీఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని 9, 18,19,20వార్డులలో స్థానిక నాయకులు, అభ్యర్థులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలంటే ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించాలన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చి ప్రజలకు సాగు, తాగునీళ్లు ఇచ్చి అభివృద్ధిని పరుగులెత్తించి దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేసినందుకు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుతోపాటు ఇతర నాయకులపై కమిషన్లు, కేసులు నోటీసులు అంటూ వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ తన అవసరానికి తగ్గట్లు ప్రవర్తిస్తాడని ఆయన మాటలు నమ్మి ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటు వేసిన ప్రజల సమస్యలు పక్కనపెట్టి హైదరాబాద్‌లో మకాం వేసాడని, ఈసారి ఆయన మాటలు నమ్మితే మళ్లీ పంగనామాలు పెట్టేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. హుస్నాబాద్‌లో ఓడిపోతామనే భయంతోనే బిఆర్ఎస్ నాయకులను పార్టీలో చేర్చుకుని మిగతా అభ్యర్థులను భయపెడుతూ ప్రలోభాలకు గురిచేసే కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయంతోనే హుస్నాబాద్ సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని, పట్టణ ప్రజలు మాయమాటలు, గారడీ చేష్టలు నమ్మి మోసపోవద్దని కోరారు.



ఉపాధి హామీ కూలీల ధర్నా దృశ్యం

## గోవర్ధనగిరిలో ఉపాధి హామీ కూలీల ధర్నా

**అక్కన్నపేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో సోమవారం ఉపాధి హామీ కూలీలు ధర్నా నిర్వహించారు. గత సంవత్సరం ఉపాధి హామీ పనుల సమయంలో మట్టి పెడ్డలు పడి ఇద్దరు కూలీలు మృతి చెందగా, మరో కూలీకి కాలు విరిగిన సంఘటన జరిగింది. ఈ ఘటన అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పనులను అధికారులు నిలిపివేశారు. అయితే ప్రస్తుతం గ్రామంలో ఉపాధి అవకాశాలు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో మృతి చెందిన ఇద్దరి కుటుంబాలకు, అలాగే కాలు విరిగిన కూలీ కుటుంబానికి ఇప్పటివరకు ఎలాంటి నష్టపరిహారం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయకపోతే ఉపాధి హామీ పనులు ప్రారంభించరాదని కూలీలు డిమాండ్ చేశారు. ఈ విషయంపై గ్రామ సర్పంచ్‌తో పాటు ఉన్నత అధికారులు చొరవ తీసుకొని బాధిత కుటుంబాలకు న్యాయం చేసి, ఉపాధి హామీ పనులు పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పందుల నివారణకు చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

**బెజ్జంకి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో పందుల బెడద తట్టుకోలేక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నివారించే చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బొల్లం శ్రీధర్(పెద్దన్న) నాయబ్ తహసీల్దార్ ఆయేషారాఫత్, ఎంపిడివో ప్రవీణ్, ఎస్ఐ సౌజన్యలకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో పందుల విచ్చల విడిగా తిరుగుతుండడంతో దుర్గంధం వెదజల్లి పిల్లలు, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. పంట పొలాలనూ నాశనం చేస్తుండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పందులను నిర్వహించే వ్యక్తులను నేరుగా గ్రామ పంచాయతీ కార్యాలయానికి పిలిపించి అడగ్గా సరిచేసుకోవడానికి కొంత సమయం కావాలని కోరారు. పందుల నివారణకు తక్షణ చర్యలకై అధికారులకు వినతి పత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పందుల నివారణ చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుమాల మహేష్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా విద్యార్థుల స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పరిపాలన జరుపుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

**మర్కుక్, ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త):** విద్యార్థులే ఉపాధ్యాయులై స్వయం పరిపాలన దినోత్సవాన్ని మండల పరిధిలోని దామరకుంట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థులు డిఈవోగా గుర్వని ప్రణయ్, ఎంఈవోగా సాయికృష్ణ, ప్రధానోపాధ్యాయురాలిగా అప్పాల రసజ్ఞ, ఉపాధ్యాయులుగా పలువురు విద్యార్థులు వ్యవహరించి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటరాములు, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకట నర్సింహారెడ్డి, కేశవరెడ్డి, సుభాష్‌చంద్ర, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెలిమితో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీయవచ్చు

### కుకునూరుపల్లి ఎంఈఒ సత్తయ్య

**కొండపాక, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :** విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడానికి చెలిమి ఎంతో దోహదపడుతుందని ఎంఈఒ కుకునూరుపల్లి బచ్చలి సత్తయ్య అన్నారు. సోమవారం కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో చెలిమి కార్యక్రమంలో భాగంగా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణనిచ్చారు. ఒరిగామి ఆర్ట్‌పై కలర్ పేపర్‌లతో వారికి నచ్చిన బొమ్మలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు వారికి నచ్చి అంశాల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణ పొందిన ఉపాధ్యాయురాలు జయశీల, ఉపాధ్యాయులు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెలిమిపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

## సమ్మెను విజయవంతం చేయాలి

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**

ఈ నెల 12 జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియూ జిల్లా కార్యదర్శి మల్లేషం పిలుపునిచ్చారు. సోమవారం 12న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని వివిధ చిన్నశంకరంపేట మండలంలోని వివిద క్లస్టర్లలో సమ్మె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను కేంద్రం వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గౌరి, అజయ్, దుర్గా, శౌకత్‌లు తపాల్గోన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL.DIST. JUDGE AT SANGAREDDY
I.A.No. 85 of 2026
in
GWOP. No. 27 of 2021.

Between:
B.J. Vinod Kumar
For the matter of Smt. B. Thara Jaipal ...Petitioner
AND
The Manager SBI, Branch at Tellapur & others ...Respondent

NOTICE

To,
The All Concerned whom so ever
Sir/Madam,

Please take notice that the above named petitioner No.1 has filed a interim application for extension of guardianship of Petitioner No.2 Smt. B. Thara Jaipal further period 3 years enable the petitioner to operate the account of petitioner No.2 held with respondent No.1 Bank, the above application is posted on 24-2-2026 for appearance of all concerned whom so ever concerned. Therefore I hereby request all concerned whomsoever having any interest or objection for getting the above relief by the petitioner may appear before the said Hon'ble Court on 24-2-2026 at 10.30 A.M. in person or through advocate duly instructed, failing which the matter will be decided exparte.

// By order of the Court //
Sd/- C. Vittal Reddy
Counsel for the Petitioner
Dist. Court Sangareddy.
Cell: 9440362798.

## కడ్పల్‌లో పిఆర్‌టియు ఆవిర్భావ దినోత్సవం



కడ్పల్‌లో పిఆర్‌టియు టిఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**సిర్గాపూర్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని కడపల్‌గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో సోమవారం పిఆర్‌టియుటిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు పిఆర్‌టియుటిఎస్ మండలశాఖ అధ్యక్షులు కర్ర నర్సింగ్‌చౌహాన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఆర్‌టియుటిఎస్ జెండాను ఆవిష్కరించి పిఆర్‌టియుటిఎస్ వ్యవస్థాపకులు స్వర్గీయ సామల యాదగిరి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయుల జీవనప్రమాణాలను పెంచడంలో సంఘం చేసిన, చేస్తున్న కృషిని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పిఆర్‌టియు టిఎస్ మండలశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశం, జిల్లా బాధ్యులు ప్రభాకర్, ఎల్‌బి నాయక్, దత్తురాజ్, నాగేందర్, రమేష్, బన్సిలాల్, మండల కార్యవర్గ సభ్యులు నర్సుగొండ, శోభారాణి, సంఘం ప్రాథమిక సభ్యులు పాల్గొని సంఘం ఔన్నత్యానికి కృషిచేస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

## ఘనంగా పిఆర్టీయు ఆవిర్భావ దినోత్సవం



పిఆర్టీయు ఆవిర్భావదినోత్సవం జరుపుకుంటున్న ఉపాధ్యాయులు

**మునిపల్లి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
మునిపల్లి మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల వనరుల కేంద్రం మునిపల్లి వద్ద పిఆర్‌టియు సంఘ 55వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు సంఘ వ్యవస్థాపకులు సామల యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి మండల నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం మునిపల్లి మండల అధ్యక్షులు చంద్రమౌళి పిఆర్‌టియు పతాకావిష్కరణ చేశారు. సంఘ అభివృద్ధికి విశేషంగా కృషిచేసిన విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రయ్య, సంగమేశ్వర్ ఈసంవత్సరం పదవీవిరమణ పొందుతున్న మునిపల్లి ప్రాథమికపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అశోక్‌కుమార్, ఖమ్మంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రకాశం, బోడపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశంలను సన్మానించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన మండల విద్యాధికారి భీమ్‌సింగ్, మునిపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మాధవిలను ఘనంగా సత్కరించారు. అనంతరం మునిపల్లి ఉన్నతపాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీచేశారు. కార్యక్రమంలో మునిపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు మాధవి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఉమేష్, జిల్లా నాయకులు రమణ, వీరయ్య, వెంకటేశం, రాములు, సోమలింగం, మండల నాయకులు భాస్కర్‌రెడ్డి, సిద్ధేశ్వర్, కిష్టయ్య, చంద్రశేఖర్, సూర్యనారాయణ, అశోక్‌కుమార్, రాజు, గోపాల్, మనోహర్‌రెడ్డి, అజారుద్దీన్, నజీర్ అలీ, మహిళా నాయకులు సంతోషికుమారి, కల్పన, మధురిమ, అరుణకుమారి, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జలమండలి ఎండిని కలిసిన కార్పొరేటర్


ఎండి అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందచేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
హైద్రాబాద్‌లోని ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో రామచంద్రాపురం కార్పొరేటర్, జలమండలి సభ్యులు బూరుగడ్డ పుష్ప నగేష్ సోమవారం జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకుని డివిజన్‌పరిధిలో అభివృద్ధిపనులు నిర్వహించేందుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ మల్లికార్జున్‌నగర్, రామచంద్రాపురం 3వ బ్లాక్‌లో, సాయినగర్ కాలనీ, వడ్డెరబస్తీలో ఉన్న డ్రైనేజీసమస్యను పరిష్కరించేందుకు 1.02కోట్ల రూపాయలు అవసరమని, అందుకు నిధులు మంజూరుచేయాలని ఎండిని కోరామన్నారు.

**రామచంద్రారెడ్డినగర్‌లో అభివృద్ధిపనులకు శ్రీకారం...**
**సిసి రోడ్డు, ఓపెన్ డ్రైన్ నిర్మాణానికి కార్పొరేటర్ పూజలు...**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డినగర్ కాలనీలో అభివృద్ధిపనులకు కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ సోమవారం భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వెన్నవరం మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్‌రావు, కార్యవర్గ సభ్యులు, ఇంజనీరింగ్ ఏఈ శివ తదితరులు పాల్గొన్నారు.

## 15లోగా నీటివనరుల గణన పూర్తిచేయాలి

**-అధికారులకు సూచించిన తహసీల్దార్ ప్రభులు**


అధికారులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ ప్రభులు

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
ఫిబ్రవరి మాసం 15వ తారీఖు లోగా మండలంలో నీటివనరుల గణన పూర్తిచేయాలని తహసీల్దార్ ప్రభులు సూచించారు. సోమవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని రెవిన్యూ కార్యాలయంలో నీటివనరుల గణనపై అధికారులతోకలిసి నిర్వహించిన సమీక్షాసమావేశంలో తహసీల్దార్ అధికారులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ, మండల గణాంక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎఈఓలు, జిపిఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పాపన్నపేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
పాపన్నపేట మండలం లోని 33/11 కెవి మిన్పూర్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా మంగళవారం. పాపన్నపేట మండల పరిధిలోని మిన్పూర్, దౌలాపూర్, కుర్తివాడ, యూసఫ్‌పేట, ఆరేపల్లి గ్రామాలలో మధ్యాన్నం 12 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని విద్యుత్‌శాఖ ఎడిఈ వేంకటేశ్వరరావు, ఏఈ నర్సింలు తెలిపారు.

## ఓటర్ దేవుళ్ల దగ్గరికి అభ్యర్థుల పరుగులు

## ఓటుకు - నోటుకు అంతే లేదు!



# ఏరులై పారుతున్న మద్యం

**గుమ్మడిదల ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీలో ఎన్నికలసమయం దగ్గరపడుతున్నకొద్దీ రాజకీయ రంగం వేడెక్కుతోంది. ఓటరే దేవుడని చెప్పుకునే నాయకులు, ఆ దేవుడి వద్దకు రోజూ పరుగులు తీస్తున్నారు. కానీ ఈ పరుగులు ప్రజాసేవ కోసం కాదు.. ఓటు కొనుగోలు కోసం! గల్లీగల్లీకి మద్యం ఏరులై పారుతోంది. డబ్బు, విందులు, వినోద కార్యక్రమాలతో ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. ఓటుకు-నోటుకు అంతేలేకుండా ప్రజాస్వామ్యాన్ని సిగ్గుపడే స్థాయికి తీసుకెళ్తున్నారు. నిన్నమొన్నటి వరకు ప్రజల సమస్యలపై పట్టించుకోని నాయకులు, ఇప్పుడు మాత్రం ఇంటింటా తిరుగుతూ మాయమాటలు చెబుతున్నారు. అభివృద్ధి, సంక్షేమం అంటూ పెద్ద పెద్ద హామీలు గుప్పిస్తూ, చేతిలో మద్యం సీసాలు, జేబులో డబ్బు పెట్టుకుని ఓటర్లను లొంగదీసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడుస్తున్నాయి. ఓటు పవిత్రతను కాలరాస్తూ, డబ్బు, మద్యం బలంతో అధికారాన్ని దక్కించుకోవాలన్న దురాశ ప్రజల ఆగ్రహానికి గురవుతోంది. గుమ్మడిదల మున్సిపాలిటీ రాజకీయ వాతావరణం పూర్తిగా కలుషితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఓటర్లు అప్రమత్తంగా ఉండి, డబ్బుకు కాదు - అభివృద్ధికి, మద్యం కోసం కాదు - మంచి పాలన కోసం ఓటు వేయాలని తెలివిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని మేధావులంతా ఓటరు మహాశయులకు ఈ సందర్భంగా పిలుపునిస్తున్నారు.

## ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారు

**-ఎమ్మెల్యే చింత ప్రభాకర్**


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
ఎన్నికలు రాగానే జగ్గారెడ్డికి సదాశివపేట, సంగారెడ్డిపట్టణ ప్రజలు ఒక్కసారిగా గుర్తుకు వస్తారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆరోపించారు. సోమవారం సంగారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఉచితంగా వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ఆయనకు అలవాటు. ఎన్నికలురాగానే ఆయన కుటుంబసభ్యులంతా ప్రచారరంగంలోకి దిగడం కూడా సహజమైపోయిందన్నారు. కాని ఎన్నికలు పూర్తయ్యాక మాత్రం ప్రజలకు ఎవ్వరూ కనిపించరని అన్నారు. ప్రజలను వినోదంతో మభ్యపెట్టే ప్రయత్నాలు ఇక పనిచేయవని, సంగారెడ్డి-సదాశివపేట ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఎన్నికలప్పుడే కాదు, ఎప్పుడూ ప్రజల మధ్య ఉండే నాయకత్వమే కావాలన్నారు. సంగారెడ్డి ముఖం చూడను అని ఇక్కడి నాయకుడు ఆనవాయితీగా చెప్పడం ప్రజాస్వామ్యానికే అవమానమన్నారు. సమావేశాల్లో మాట్లాడే మాటలను ప్రజలు ఇక నమ్మే స్థితిలో లేరని అన్నారు. మీడియా సమావేశంలో మామిళ్ళ రాజేందర్, మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, ఇంచార్జి రాజనర్సు, సోమిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

## బిఆర్‌ఎస్ హయాంలోనే జహీరాబాద్ అభివృద్ధి

**-విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు**


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
బిఆర్‌ఎస్ హయాంలోనే జహీరాబాద్ పట్టణం అన్నిరంగాల్లో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ మాజీచైర్మన్ మల్కాపురం శివకుమార్, మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి దేవి ప్రసాద్‌లు అన్నారు. మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికల ప్రచారానికి చివరిరోజైన సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే, మాజీ చైర్మన్, ఇంచార్జిలు మాట్లాడుతూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు నాయకత్వంలో జహీరాబాద్ పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందిందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను అంధకారంలో ముంచేశారని మండిపడ్డారు. సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు షేక్ ఫరీద్, గుండప్ప, విజయ్‌కుమార్, తట్టు నారాయణ, వెంకటేశం, రవీందర్, సంజీవరెడ్డి, ఆర్.సుభాష్, నామ రవికిరణ్, నీల వెంకటేశం, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మూడో వార్డులో ముమ్మర ప్రచారం


మూడోవార్డులో ప్రచారం చేస్తున్న పులుగు గోపాల్‌రావు

**జోగిపేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
జోగిపేట పట్టణంలోని మూడో వార్డులో బిజెపి అభ్యర్థి పులుగు గోపాల్‌రావు ప్రచారంలో దూసుకుపోతూ ప్రజల ఆదరణ పొందుతున్నారు. ఆది నుంచి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంనుంచి వచ్చిన యువకుడు, విద్యావంతుడు. గోపాల్‌రావు తండ్రి తొలి-మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు, టిఎన్జీవో అధ్యక్షులు కీర్తిశేషులు పులుగు కిష్టయ్యకు నియోజకవర్గంలో మంచి పట్టుంది. ఆయన రాజకీయ వారసత్వాన్ని పులుగు గోపాల్‌రావు కొనసాగిస్తూ యువతలో మంచి పేరున్న నాయకుడుగా గుర్తింపు పొందాడు.

## వార్డు అభివృద్ధికి అన్నివిధాలుగా కృషిచేస్తా!

**-9వ వార్డు బిజెపి అభ్యర్థిని మహేష్కర్ పావనిసుమన్**


ప్రచారం చేస్తున్న మహేష్కర్ పావనిసుమన్

**జోగిపేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డును అభివృద్ధి చేసేందుకు తాను అన్నివిధాలుగా కృషిచేస్తానని, తనను ఆదరించి గెలిపించాలని బిజెపి అభ్యర్థిని మహేష్కర్ పావనిసుమన్ ఓటర్లను వేడుకుంటున్నారు. మాజీ పార్లమెంటు సభ్యులు బిబి.పాటిల్, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావుల సహకారంతో వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె పేర్కొంటున్నారు. ఇంటింటికీ వెళ్లి తనను గెలిపిస్తే వార్డు ప్రజలు ఎల్లపుడు అందుబాటులో ఉండి, అండగా ఉంటానని, ఈ విషయాల్ని గ్రహించి వార్డు ప్రజలు తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరుతున్నారు.

## ఎన్నికల రోజు పరిశ్రమలు హాలీడే ప్రకటించాలి

**-సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రాజయ్య డిమాండ్**

**గుమ్మడిదల, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
ఫిబ్రవరి 11న జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల రోజు మున్సిపల్ పరిధిలో ఉన్న అన్ని పరిశ్రమలకు సెలవు వెంటనే యజమానులు ప్రకటించాలని, జిల్లా కలెక్టర్ సర్క్యులర్‌లో స్పష్టత ఉండాలనీ, ఆరోజు పరిశ్రమలు గనుక నడిపితే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని, పరిశ్రమల వద్ద ఆందోళన చేస్తామని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రాజయ్య హెచ్చరించారు. రాజయ్య మాట్లాడుతూ ఎన్నికల రోజున పరిశ్రమల యజమానులు బరితెగించి ఇష్టానుసారంగా కార్మికుల హక్కులను హరించి వేస్తే మాత్రం చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు. ఎన్నికలరోజుకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఇచ్చిన సర్క్యులర్‌లో స్పష్టతలేదని ఆయన అన్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కూడా సర్క్యులర్‌ను వెంటనే సవరించాలని ఆయన డిమాండ్‌చేశారు.

## అల్లాదుర్గంలో ఉపాధిహామీ పనులు ప్రారంభం

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన అల్లాదుర్గంలో సోమవారం జాతీయ ఉపాధిహామీ పనుల్లో భాగంగా బట్టికంటచెరువు నుంచి పెద్దపటేల్‌చెరువుకు పోయే కట్టు కాలువకు కాలువ తవ్వకాల పనులను ఎంపిడిఓ వేద ప్రకాష్ ప్రారంభించారు. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ సూచించారు. కార్యక్రమంలో సర్పంచి మద్దూరి సౌమ్య, ఉపసర్పంచి కళాయి పాండు, పంచాయితా కార్యదర్శి ప్రభాకర్, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ సక్కుబాయి, వార్డుసభ్యులు మంగలి పాండు, సక్క భూమమ్మ, మద్దూరి సురేష్‌గౌడ్, ఆవుల సుధాకర్ పాల్గొన్నారు.

## సిఎం కప్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అఖిలేష్ రెడ్డి

**సంగారెడ్డిమున్సిపాలిటీ, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
సిఎం కప్ 2025 జిల్లా స్థాయి క్రీడా పోటీలను సోమవారం సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడలు, సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి మాట్లాడుతూ, సిఎం కప్ క్రీడాపోటీలను గ్రామస్థాయి నుంచే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయి, మండల స్థాయి, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ జిల్లాస్థాయి పోటీలు నేడు, రేపు మొత్తం రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ స్థాయిలలో ప్రతిభ చాటిన క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీలకు హాజరయ్యారని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పంపడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రస్థాయి సిఎం కప్ క్రీడా పోటీలు ఈ నెల 20వ తేదీ నుండి ప్రారంభం కానున్నట్లు అఖిలేష్‌రెడ్డి తెలిపారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభను చాటి సంగారెడ్డి జిల్లాను మొదటి స్థానంలో నిలిపి సంగారెడ్డి జెండా ఎగురవేయాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, కరాటే, వుషు కిక్ బాక్సింగ్, ఫుట్‌బాల్, ప్రెస్లింగ్, జూడో, బాక్సింగ్ నందు క్రీడాకారులకు క్రీడలు నిర్వహించడం జరిగిందని, ఈ క్రీడలలో 1500 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ క్రీడలలో మొదటి, రెండవ స్థానంలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యస్‌జియఫ్ సెక్రెటరీ శ్రీనివాస్, టిఎన్‌జిఓ, అథ్లెటిక్ సెక్రెటరీ జావిద్ అలీ, హ్యాండ్‌బాల్ సెక్రెటరీ విజయ్, స్విమ్మింగ్ సెక్రెటరీ శశ్వంత్, బాల్ బ్యాడ్మింటన్ విజయ్‌బాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐ బ్యాంక్‌లో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు


ఎస్‌బిఐ బ్యాంక్‌లో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల దృశ్యం

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని ఎస్‌బిఐ బ్యాంక్ ఆవరణలో సోమవారం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా మేనేజర్ ప్రవీణ్‌కుమార్ కెవైసి, ఆర్‌ఈకెవైసి, ఈకెవైసి, ఉడ్‌గం పోర్టల్, సైబర్‌నేరాల లాంటి అంశాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. బ్యాంక్‌లోని సోషల్‌సెక్యూరిటీ స్కీమ్స్, ఇన్సూరెన్స్ పథకాలను, బ్యాంక్ అందిస్తున్న సేవలపై వివరించారు. బ్యాంక్‌సేవలను ప్రతి ఖాతాదారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైబర్‌నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ సిబ్బంది, సిఎస్‌పి ప్రవీణ్, ఆర్‌బిఐసిఎఫ్‌ఎల్ కౌన్సిలర్ ఎం.అజయ్‌కుమార్, కె.మహేశ్వర్‌గౌడ్, బ్యాంక్ ఖాతాదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్.. ఓట్ల ఒట్లు తగునా..?

**-బస్సు తప్ప.. అంతా తుస్సే..!!**
**-రామాయంపేటలో మాజీమంత్రి హరీష్‌రావు ఫైర్**


రామాయంపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

**రామాయంపేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓట్ల ఒట్లు పెడుతూ దేవుణ్ణి మోసం చేస్తున్నారంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. రామాయంపేట మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన రోడ్ షోలో పాల్గొన్నారు. భారీ రోడ్ షోకు జనం పెద్ద ఎత్తున తరలి వచ్చారు. బిఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు హరీష్‌రావుకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీష్‌రావు కాంగ్రెస్ పాలనపై, రేవంత్‌రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. అమలుకాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండున్నరేళ్లలో ఏ ఒక్కటైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. బస్సుపథకం తప్ప మిగతాపథకాలన్నీ తుస్సుమనిపించారని విమర్శించారు. కాంగ్రెస్‌వాదుల గుండాగిరికి పోలీసులు వత్తాసు పలకటం మానాలని హరీష్‌రావు హితవుపలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్‌తో పాటు 12 వార్డులలో పోటీచేసే బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అభివృద్ధే ఎజెండాగా విస్తృత ప్రచారం


ప్రచారం చేస్తున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

**గుమ్మడిదల, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఉండగా, అదే అభివృద్ధి ఊపుతో గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షురాలు కాటా సుధారాణి, 22 వార్డులకు సంబంధించి అన్నివార్డుల్లో విస్తృతప్రచారం నిర్వహించారు. అన్నారం నుంచి గుమ్మడిదల మున్సిపల్ కేంద్రం వరకు సాగిన ఈ రోడ్‌షో ప్రజల మద్దతుతో హోరెత్తింది. రోడ్డు షోలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత భారీ సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ జెండాలతో, నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపాలిటీ ఇంచార్జ్ జైపాల్, ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు, వీరభద్రస్వామి దేవాలయం మద్ది ప్రతాపరెడ్డి, సీనియర్ నాయకులు హిందువుల సురేందర్‌రెడ్డి, మద్ది వీరారెడ్డి, సురభి నాగేంద్రగౌడ్, గోవర్ధన్‌గౌడ్, మూడుచింతల నరేందర్‌రెడ్డి, జయశంకర్ గౌడ్, ఆకుల ఆంజనేయులు, తుడుం శ్రీనివాస్, మద్దుల బాల్‌రెడ్డి, అన్నివార్డుల అభ్యర్థులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ముప్పారంలో ఉచిత వైద్య శిబిరం

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ముప్పారంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని గ్రామసర్పంచి కవిత ప్రారంభించగా ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. శిబిరానికి చేరుకున్న 2 వందల మందిని డాక్టర్లు పరీక్షించి, వైద్యం అందించి, అవసరమైన వారికి మందు బిళ్లలను అందచేశారు. కార్యక్రమంలో అంబదాస్, స్పెషలిస్ట్, ఆర్థోపెడిక్, వైద్య నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరం పై దాడి..

**-13వేలు జప్తు, కేసు నమోదు**


పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**పాపన్నపేట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**
అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై స్పెషల్ పోలీసులు దాడిచేసి రూ. 13,400 జప్తు చేసి పేకాటరాయుళ్ళపై కేసు నమోదు చేసినట్లు పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని అన్నారం అటవీ ప్రాంతంలో శంకరంపేట మండలంలోని చందంపేట గ్రామానికి చెందిన ఇరువురుతోపాటు అన్నారంగ్రామానికి చెందిన మరొకరు కలసి పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు స్పెషల్ పోలీసులు దాడిచేసి 13,400 రూపాయలతోపాటు ముగ్గురిని అదుపులోకి తీసుకొని పాపన్నపేట పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.